## వాడవాడలా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జరపండి

- 21న హైద్రాబాద్లో రాష్ట్ర స్థాయి తెలంగాణ విలీన దినోత్సవ సభ
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా



కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)

నిజాం రాకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల వైపు నడిపించి తెలంగాణకు విముక్తి కలిగించి విశాల భారతంలో విలీనం చేసిన నాటి కమ్యూనిస్టు పోరాట యోధులు, అమరవీరులను స్మరించుకుంటూ సెప్టెంబర్ 11 నుంచి 17వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నుంచి మంగళవారం గూగుల్ మీట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా సమితి సమావేశం నిర్వహించ్రరు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ నిజాం రాచరిక పాలనలో వెట్టిచాకిరి, అంటరానితనం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, కటిక దారిద్ర్యం హైద్రాబాద్ రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్న తరుణంలో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఆంధ్ర మహాసభ సంఘటిత ఉద్యమాలకు పిలుపునిచ్చి నిజాం రాచరిక వ్యస్థను కూల్చివేయడం జరిగింది, ఈ మహెూద్యమంలో ఎందరో కమ్యూనిస్టులు, ఉద్యమకారులు నేలకొరిగారని వారి త్యాగాలను నేటితరానికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. నాడు రైతాంగ పోరాటంలో పంచిన భూముల్లో నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో వంతు కూడా పంచలేదని విమర్శించారు. కొంత మంది అవకాశవాదులు పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సాయుధ పోరాటానికి తామే వారసులమంటూ బిజెపి నాయకులు రాజకీయంగా లబ్దిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని, తెలంగాణ విముక్తికోసం త్యాగాలు చేసిందేవరో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 17వరకు గ్రామగ్రామాన ఉత్సవాలు నిర్వహించి సభలు, సమావేశాలు, జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టి నాటి కమ్యూనిస్టుల స్ఫూర్తిని చాటాలని, సెప్టెంబర్ 21న హైద్రాబాద్లో జరిగే తెలంగాణ విలీన దీనోత్సవ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)

కొత్తగూడెం ఏరియా జిఎం ఆదేశానుసారం ఈ సంవత్సరం 2024-25 నకు గాను కొత్తగూడెం ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్, జనరల్ కెప్టెన్, వివిధ స్పోర్ట్స్ కెప్టెన్ ల నియామకాల కొరకై కమిటీ సమావేశం కొత్తగూడెం ఏరియా డీజీఎం(పర్సనల్) బి. శివ కేశవరావు సమక్షంలో నిర్ణయించడం జరిగింది. ఈ కమిటీ సమావేశంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గా జే. రాంబాబు, జనరల్ కెప్టెన్ గా కే. నాగమోహన్ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జున రావు, కొత్తగూడెం ఏరియా ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ ఎం శ్రావణ్ కుమార్ డివై. పిఎం, ఏఐటీయూసీ జి. వీరాస్వామి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్. కే గౌస్, ఫిట్ సెక్రటరీ జిఎం ఆఫీస్ సిహెచ్ సాగర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సింగభూపాలెం చెరువుకట్ట పటిష్టానికి కృషి

- గతపాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదకర స్థాయికి చేరిన చెరువుకట్ట
- ఎలాంటి నష్టం జరగకుండా నీటిపారుదల శాఖ అధికారులు సత్వర చెర్యలు చేపట్టాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల, పరిసర గ్రామాల రైతులకు ప్రధాన నీటివనరుగా ఉన్న సింగభూపాలెం చెరువు కట్టను పటిష్టం చేసి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, ఇప్పటి వరకు జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించి రైతులకు న్యాయం చేస్తామని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. మండలంలోని సింగభూపాలెం చెరువు కట్ట, పరివాహక ప్రాంతాలు, వ్యవసాయ భూములను మంగళవారం సిపిఐ ప్రతినిధివరుందం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ చెరువు పరివాహక రైతులు అధైర్య పడొద్దని సూచించారు. చెరువుకట్ట పరిస్థిని ముందస్తుగానే గుర్తించి ఇటీవల స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నీటి పారుదల శాఖా అధికారులతో మాట్లాడి నివేదిక సిద్ధం చేయలని ఆదేశించినట్లు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంవల్ల చెరువుకట్టకు ఇలాంటి దుస్థితి ఏర్పడిందని, రూ.26 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించి కుంగిపోతోందని, ఈ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లాతోపాటు నియోజకవర్గం లో సీతారామ ప్రాజెక్టు నీటి పారుదలకు కూనంనేని కృషి చేస్తున్నారని, అదేవిదంగా చెరువును పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అధివర్షాలవల్ల చెరువుకట్ట కృంగిపోయిందన్నారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని నీటిపారుదల అధికారులకు సూచించారు. మిర్చి వరి పత్తి కూరగాయలు ఉద్యానవన పంటలకు వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వ్యవసాయ అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లునాయకులు భాగం శేషభూషణం, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, పొదిల శ్రీనివాసరావు, వీర్ల మల్లేష్ ఏఐటీయూసీ, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, మూడు గణేష్, భాగం కృష్ణ, దండు నాగేశ్వరరావు, గడ్డం రాజేందర్, దండు సురేష్, ఆకుల వెంకన్న, శీలపోగు సురేష్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ





కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)

గణేష్ నవరాత్రుల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వద్ద గోదావరి నదికి నిమజ్జనోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్టమైన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ ఐపిఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు గోదావరి నది కరకట్ట వద్ద జరుగుతున్న నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ ఉన్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారినందున పరిసర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి నదీ ప్రవాహాన్ని వీక్షించేందుకు కరకట్ట మీదకు ఎవరూ రాకూడదని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కరకట్ట మీద ఎవరైనా సంచరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కరకట్ట పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. నిమజ్జనోత్సవానికి గణేష్ ప్రతిమలను తీసుకొని వచ్చే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.

# గర్భంలో మెదడు అభివృద్ధి పిల్లల
# భవిష్యత్తుకు కీలక పునాది

**అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ నాగ శ్రావణి**



**హైదరాబాద్,సెప్టెంబర్10(కెరటం ప్రతినిధి)**

గర్భంలో మెదడు అభివృద్ధి పిల్లల భవిష్యత్తుకు కీలక పునాది అని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) కన్సల్టెంట్ డెవలప్‌మెం టల్, బిహేవియరల్ పీడియాట్రిషియన్ డాక్టర్ నాగ శ్రావణి తెలిపారు. మానవ శిశువు తల్లి గర్భంలో సూక్ష్మ ప్రపంచంలో జీవిస్తుందన్నారు. అన్ని జీవులకు తల్లి భూమి వలే.. కడుపులోని శిశువు శారీరక ఎదుగుదల మాత్రమే కాకుండా మానసిక, భావోద్వేగ అభివృద్ధికి కూడా తల్లి సృష్టించిన ఈ ఆధ్యాత్మిక వాతావరణంపై ఆధార పడుతుందని చెప్పారు. అందువల్ల తల్లుల పోషకాహారం, ఆహార అవసరాలు ఎక్కువ ప్రా ముఖ్యతను సంతరించుకుంటాయని తెలిపారు.

శిశువు శారీరక ఎదుగుదల, బరువు పెరుగుట, అవయవ అభివృద్ధి, నిర్మాణ అసాధారణతలపై మాట్లాడతారని, కానీ పిండం తాలూకా ముఖ్యమైన ఇంద్రియ అభివృద్ధిపై అరుదుగా మాట్లాడతారన్నారు. గర్భాశయంలో ఈ ప్రారంభ దశ నుంచి రెండు సంవత్సరాల ప్రసవానంతర వయస్సు వరకు.. బిడ్డ మంచి వాతావరణంలో నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఇది ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించడంలో సహాయపడుతుందని తెలిపారు. గర్భం లోపల పెరుగుదల వివిధ దశలలో శిశువు అనుభూతి చెందడం ఉంటుందన్నారు.

గర్భం దాల్చిన 11 వారాల నుంచి శిశువు స్పర్శను అనుభవించడం ప్రారంభమవుతుందని తెలిపారు. నోరు, చేతులు, కాళ్ళతో ఉమ్మ నీరు ద్వారా స్పర్శ అనుభూతి చెందుతారన్నారు. చేతులు, కాళ్ళతో గర్భాశయ గోడను తాకడం ద్వారా ఇవి తల్లి కదలిక, శారీరక శ్రమకు అనుగుణంగా ఉంటాయన్నారు. ఇది శిశువుకు పరిచయం అయ్యే గర్భాశయ గోడ లోపల కదలికను కలిగిస్తుందని పేర్కొన్నారు. పాట్స్, స్ట్రోక్స్, సున్నితమైన ఒత్తిడికి ప్రతిస్పందించగల రన్నారు. ఓదార్పుగా మాట్లాడుతున్నప్పుడు పొట్టపై చేయి వేయడం వల్ల స్పర్శ పెరుగుతుం దన్నారు. 18 వారాల గర్భధారణ సమయంలో వినికిడి ప్రారంభమవుతుందన్నారు. శిశువు వినికిడి దాదాపు 26 నుంచి 28 వారాలకు పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రారంభం లో తక్కువ శబ్దాలను వినగలరన్నారు. ఇది పుట్టుకతో మెల్లగా పరిపక్వం చెందుతుం దన్నారు. మొదట్లో తల్లి గుండె చప్పుడు, కడుపు చప్పుడు వినగలరన్నారు. నెమ్మదిగా మీరు మాట్లాడటం వినడం ప్రారంభిస్తారన్నారు. క్రమంగా వివిధ శబ్దాల మధ్య తేడాను గుర్తించడం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిశువు వివిధ శబ్దాలు, స్పర్శలతో తల్లి ఆనందం, విచారం, ఆందోళనను గ్రహించగలరన్నారు. గర్భం దాల్చిన 30 వారాల తర్వాత ఓదార్పు పొందుతున్నారని భావించడం ప్రారంభించవచ్చున్నారు.

తల్లిదండ్రులు శిశువుతో వేర్వేరుగా మాట్లాడట ం ప్రారంభించాలన్నారు. పాటలు, రైమ్స్, శ్లోకాలు పాడాలి, వాయిస్ హెచ్చుతగ్గులతో చిన్న కథలను చదవడానికి ప్రయత్నించాలని తెలిపా రు. రోజులో వేర్వేరు సమయాల్లో స్పర్శ వంటి విభిన్న అనుభూతిని జోడించడానికి ప్రయత్నిం చాలన్నారు. ఇది పిల్లవాడిని మంచిగా సృష్టించ డానికి సహాయపడుతుందని తెలిపారు. తల్లి, తండ్రితో బంధం అదే శ్రవణ ఇన్‌పుట్‌ను పుట్టిన తర్వాత శిశువును ప్రశాంతంగా లేదా శాంతపర చడానికి ఉపయోగించవచ్చున్నారు. ఇది బిడ్డకు సులభంగా సర్దుబాటు అవుతుందన్నారు.

దృష్టి అభివృద్ధి పుట్టిన తర్వాత అభివృద్ధి చెందుతూ ఉంటుందన్నారు. సుమారు 28 వారాలకు కళ్ళు తెరవగలరన్నారు. కానీ గర్భం లో కాంతిని గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటా రన్నారు. కాబట్టి, సూర్యరశ్మిలో ఆరుబయట నడక వంటి శారీరక శ్రమను పొందడం చాలా ముఖ్యమన్నారు. గర్భం మూడవ నెల నాటికి రుచి అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధి చెందిన రుచి అమ్నియోటిక్ ద్రవం ద్వారా పరోక్షంగా రుచిని అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాయన్నారు. తల్లి తినే అమ్నియోటిక్ ద్రవం ద్వారా వారు ఆహారాన్ని రుచి చూస్తారన్నారు. ఇది పుట్టిన తర్వాత వారి ప్రాధాన్యతలను కొంతవరకు నిర్ణయిస్తుందని పరిశోధకులు పేర్కొన్నారన్నారు. గర్భం దాల్చిన 28 వారాలకు వాసన మొదలవుతుందని తెలిపారు. పిల్లలు పుట్టిన వెంటనే తెలిసిన వాసనలకు ప్రతిస్పందిస్తారన్నారు. గర్భం దాల్చిన 10 వారాల తర్వాత తల, మెడను కదిలించడం ప్రారంభిస్తారన్నారు. 18 వారాల తర్వాత చేతులు, కాళ్లు తన్నడం, మెల్లగా ఎముకలను బలపరుస్తుందన్నారు. కండరాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇంద్రియ అభివృద్ధి ఎలా జరుగుతుందో? మెదడు అభివృద్ధిని ప్రోత్సహించ డానికి గర్భం నుంచే ముందస్తు ప్రేరణను ఎలా ప్రారంభించవచ్చో ఇప్పుడు మనకు తెలుసన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రైన్ కోట్, నూనె సబ్బులు పంపిణీ

**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం మునిసిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు మునిసిపల్ చైర్ పర్సన్, కమిషనర్, కౌన్సిలర్ల సహకారంతో రైన్ కోట్లు, నూనెలు సబ్బుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి ఏటా వారికి సమకూర్చవలసిన రైన్ కోట్లు, నూనె సబ్బులు క్రమం తప్పకుండా ఇప్పించడం జరుగుతుందని, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం విషయంలో కొత్తగూడెం మునిసిపల్ కౌన్సిల్ ఎల్లప్పుడూ ముందే ఉంటుందని, కొత్తగూడెం పట్టణం స్వచ్ఛ కొత్తగూడెం పట్టణంగా రూపుదిద్దడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని వారు అన్నారు. ఈ కౌన్సిల్ ఏర్పడ్డ దగ్గరి నుండి పారిశుద్ధ్య కార్మికులకు రెండు పర్యాయాలు వేతనాలు పెరిగాయని, వారు అందించే సేవలకు వారి వేతనాలు మరింతగా పెరిగే విదంగా కృషి చేయడంలో కొత్తగూడెం మునిసిపల్ కౌన్సిల్ ఎప్పుడు ముందుంటుందని ఈ సందర్భంగా వారు అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జమలయ్య, మేనేజర్ ప్రసాద్ గారు, డిఈ రవికుమార్, ఆర్.వో రవీందర్, మ్యూనిసిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



## మిడ్డే మీల్స్ కార్మికులకు రూ.10వేల వేతనం హామీని అమలు చేయాలి

- బకాయి బిల్లు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా




**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**

కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ. 10వేల వేతన హామీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయము ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయి అధికారం చేపట్టి తొమ్మిదినెలకు గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్న రూ. 10వేల గౌరవ వేతనం అమలుచేయడం లేదన్నారు. పాఠశాలల్లో వంటా వార్పు పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి కార్మికులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తోందని, ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, బకాయి బిల్లులు తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ , సత్తెనపల్లి విజయ లక్ష్మి, పుష్ప. మంగ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి సభ్యత్వ సన్నాహక కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

**బిజేపి జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగా కిరణ్**



**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**

ఈ నెల 11 అనగా బుధవారం ఉదయం 11 గంటలకు బిజేపి సభ్యత్వ సన్నాహక సమావేశం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు రానున్నారని బిజేపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి రంగా కిరణ్ తెలిపారు. ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా నందు ఉన్న రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు వివిధ మోర్చా అధ్యక్షులు, నాయకులు ఐదు నియోజకవర్గ కన్వీనర్లు 30 మండలాలకు చెందిన అధ్యక్షులు మండల కార్యవర్గ నాయకులు అందరూ హాజరై ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం కొత్తగూడెం పాత బస్ డిపో నుండి కొత్తగూడెం క్లబ్ వరకు బైక్ ర్యాలీ తో ప్రారంభమై కొత్తగూడెం క్లబ్ నందు జిల్లా నాయకులు ముఖ్య అతిథి సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. తదనంతరం కార్యకర్తల అందరికీ దిశా నిర్దేశం చేస్తారు కావున జిల్లాలో ఉన్న నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ పోనిశెట్టి వెంకటేశ్వర్లు, కో కన్వీనర్లు తాటిపాముల ఐలయ్య,బైరి నిర్మల దేవి, మండల అధ్యక్షులు గొడుగు శ్రీధర్ యాదవ్, భూక్యా రాజేష్ నాయక్, మాలోత్ గాంధీ మరియు పాల్వంచ మండల అధ్యక్షుడు క్రాంతి పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలం షైనీకి ఘనంగా అంతిమ వీడ్కోలు

- జిల్లా పోలీస్ శాఖకు పోలీస్ జాగీలం షైనీ అందించిన సేవలు మరువలేనివి
- అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ ఐపీఎస్





**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**

జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ జాగిలం అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. గత నెల రోజులుగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం తుది శ్వాస విడిచింది. ప్రేలుడు పదార్థాలను కనిపెట్టడంలో నైపుణ్యత కలిగిన షైనీ మరణించడం జిల్లాకు తీరని లోటని అడిషనల్ ఎస్పీ పంకజ్ పరితోష్ ఐపీఎస్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాలతో మంగళవారం జాగీలం షైని కి ఘనంగా అంతిమ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2014 సంవత్సరంలో జన్మించిన పోలీస్ జాగిలం షైనీ 2016లో జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్లో విధులలో చేరి సుమారుగా పది సంవత్సరాల పాటు తన సేవలను అందించడం జరిగింది. 30 కి పైగా పేలుడు పదార్థాలను గుర్తించిన ఘటనలో పాల్గొని సమర్థవంతంగా విధులను నిర్వర్తించిందని తెలిపారు. జిల్లాలో విఐపి ల పర్యటనల్లో విధులు నిర్వర్తించడం,ల్యాండ్ మైన్స్ ను గుర్తించడం వంటి సేవలను అందించిందని,ఎక్కువ శాతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తన సేవలు అందించిందని తెలియజేసారు. అనంతరం షైనీ భౌతిక కాయానికి పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఓఎస్డి కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్ నుండి అంతిమయాత్రగా బయలుదేరి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు షైనీ కి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,1టౌన్ సీఐ కరుణాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఆర్ఐ ఆపరేషన్స్ రవి, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ సేన 10వ ఆవిర్భవ దినోత్సవం



- జెండాను ఆవిష్కరించిన సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్

**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**

సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధరావత్ సురేష్ నాయక్ సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం ప్రక్కన ఏర్పాటు ఏర్పాటుచేసిన ఆవిర్భవ దినోత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సెంట్రల్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్చంద్ నాయక్,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్ సేవాలాల్ సేన జండాను ఆవిష్కరించారు .తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పెద్ద ఎత్తున సేవాలాల్ సేన సైనికులు ఎడతెరపనీ వర్షాన్ని లెక్కచేయకుండా జెండా ఆవిష్కరణ చేయడం సేవాలాల్ సేన ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. అదేవిధంగా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమన్వయ కమిటీ చైర్మన్ టిఎస్ టిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణలో సేవాలాల్ సేన ప్రత్యామ్నాయం కాబోతావుందని అన్నారు. బంజారా బిడ్డలు ఎటువైపు మొగ్గుచూపితే అటువైపు అధికారం వస్తదని, కేసీఆర్ అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ జిల్లా ఈ జిల్లాలో అపారమైన ఖనిజ సంపద గోదావరి పరివాహక ప్రాంతం బొగ్గు నిక్షేపాలు అన్నీ ఉండి ఇండస్ట్రీస్ బలంగా నిర్మించబడి ఈ రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా ఉపయోగపడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏజెన్సీ జిల్లా మీద దృష్టి పెట్టకుండా వెనుకబాటు తనానికి కారణం అవుతుంది తెలంగాణలోనే ధర్మల్ రెండ పవర్ స్టేషన్ నాలుగైదు చోట్ల ఇల్లందు కోయగూడెం కొత్తగూడెం మణుగూరు ఏరియాలలో కోల్ బెల్టుబారకల్మజాలపాక భారీ జల కర్మకారము అశ్వాపురం నవభారతం ఉన్నప్పటికీ ఈ భద్రాది జిల్లాకు ఒరిగింది ఏమి లేదని వాపోయారు కోల్ బెల్టు ఏరియా అందులో ఇండస్ట్రీ ఏరియా కావడం వల్ల ఇక్కడ వాతావరణం నీళ్లు ఆహారము కలుషితమై ఇక్కడున్న ప్రజలకు తెలియకుండానే క్యాన్సర్ బారిన పడతావున్నారు ఈ విషయం తెలివక అమాయక గిరిజనలు క్యాన్సర్ వచ్చిందని విషయం తెలవకుండా చూపించే నాటికి నాలుగో స్టేజిలో చచ్చిపోతా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఈ జిల్లా మీద దృష్టి పెట్టి మెగా మెడికల్ క్యాంప్ పెట్టి క్యాన్సర్ బారిన పడినటువంటి రోగులను గుర్తించి వారికి చికిత్స చేయాలని అదేవిధంగా కోల్ బెల్టు ఏరియాలో సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ హాస్పిటల్ ను ఏర్పాటు చేయాలని కోరారు భద్రాద్రి జిల్లా కళ్ళముందు కనబడుతున్న నీళ్లు ఇక్కడున్నటువంటి రైతులుకి అందకపోవడము దారుణం అన్నారు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు అండర్ లైన్ ద్వారా రోల్లపాడు చెరువుకి బయ్యారం పెద్ద చెరువుకి ఒక లక్ష్యం ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ని ఉన్నప్పటికీ దాన్ని నిర్లక్ష్యం చేస్తూ గత ప్రభుత్వం కేసీఆర్ గారు రోల్లపాడు చెరువు ప్రాజెక్టు పెద్ద ప్రాజెక్ట్ చేయాలని శంకుస్థాపన చేసినప్పటికీ అది శంకుస్థాపనకి పరిమితమైందని సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అందాల్సినది పోయి పక్క జిల్లా కు చేరడం అనేది పాలకుల నిర్లక్ష్యంగా మేము భావిస్తాం ఉన్నాం ఇప్పటికైనా ఈ భద్రాద్రి జిల్లాని కోనసీమ జిల్లాగా మార్చేలా ప్రతి రైతుకు నీళ్లు అందేలా కిన్నెరసాని రోల్లపాడు బయ్యారం చెరువులని లింక్ చేస్తూ కాలువ నిర్మించాలని డిమాండ్ చేస్తా ఉన్నాము ఏజెన్సీ ప్రాంతంలో 5 త్ షెడ్యూల్ ద్వారా1/70 యాక్ట్ పీసా చట్టం ద్వారా గిరిజనులకు అందాల్సినటువంటి హక్కులను కాపాడే దాంట్లో రాష్ట్రప్రభుత్వం ముందుండాలని కోరారు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు 20 ఎకరాలకు రైతు భరోసా వర్తింప చేయాలని రెండు లక్షల రుణమాఫీకి కండిషన్స్ అప్లై చేయకుండా ఉద్యోగులకు కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రభుత్వానికి కోరింది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం సేవలాల్ సేన ప్రతి అంశాన్ని పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ధరావత్ ప్రేమ్చంద్ నాయక్ సెంట్రల్ కమిటీ చైర్మన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ బంజారా జాతి రాజ్యాధికారం దిశగా ప్రయాణించేంతవరకు నా కొనవుపిరి వరకు పోరాడతారని బంజారా బిడ్డలని ఏకం చేసే పనులనే ఉంటానని జాతి ఐక్యతే నాకు ప్రాణం అని ఇవాళ సేవాలాల్ సైనికులకు దిశ నిర్దేశం చేశారు. సేవలాల్ సేన నాయకులు ధర్మజాగరణ సేన రాష్ట్ర ఇంచార్జ్ వాంకుడోత్ హత్తి రామ్ నాయక్, సేవాలాల్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు బాదావత్ శ్రీను నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి రాథోడ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్, ధర్మ జాగరణ సేన ఉపాధ్యక్షులు రాంచందర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుపుల మంగీలాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు నాయక్, ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, గణేష్ నాయక్, జిల్లా నాయకులు, వివిధ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# 17నే నిమజ్జనం

**కొత్తగూడెం, సెప్టెంబరు10(కెరటం ప్రతినిధి)**



ఈ నెల 17న గణనాథుడి నిమజ్జన కార్యక్రమం ఉంటుందని కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ తెలిపింది. మంగళవారం కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.వి.రంగా కిరణ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుడిని ఈ నెల 17న నిమజ్జనం చేసేందుకు ముహూర్తం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఆ తేది మంగళవారం కావడంతో మండప నిర్వాహకులు, భక్తుల నుంచి అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వాటినీ నివృత్తి చేసేందుకు హైద్రాబాద్ లోని ప్రముఖ ఉత్సవ కమిటీలు,ఆగమ శాస్త్ర పండితులను సంప్రదించగా వారు ఎట్టి పరిస్థితుల్లోనూ నవ రాత్రులు పూజలు అందుకున్న గణ నాధుడికి అనంత పద్మనాభ చతుర్దశి ఏ రోజూ వస్తే ఆ రోజున, వారాలతో సంబందం లేకుండా నిమజ్జనం జరపాలని స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ కారణంగా ఈ నెల 7 వ తేదీన వినాయక చవితి పండుగ జరుపుకున్న నాటి నుంచి వచ్చే మంగళవారం రోజూ సరిగ్గా అనంత పద్మనాభ చతుర్దశి రావడం వల్ల అదే రోజున నిమజ్జనం చేస్తారు. అవసరమైతే సోమవారం రాత్రి పూజా కార్యక్రమాల అనంతరం మండపంలో కొలువై ఉన్న వినాయక విగ్రహాన్ని పూజారులతో కదిపి తెల్లారి యథావిధిగా నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవచ్చని సూచించారు. కావున వేద బ్రాహ్మణులు, పండితుల నిర్ణయం మేరకు ముందుగా అనుకున్న ప్రకారమే మంగళవారం భద్రాద్రి జిల్లా అంతటా నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలియపర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దారా రమేష్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ , కూర శ్రీధర్, గొడుగు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.